

# పసిడిమనసులు - షర్మిల



## బేబత్తమ్మ

**అత్తమ్మని పేరు** పెట్టి ఎవరూ పిలవరు. ఆమెకో పేరు వుందని చాలా కొంతమందికే తెలుసు. చిన్నా పెద్దా అందరూ బేబక్కా ! అంటారు .

ఐతే నేను బేబక్కా అంటే మాత్రం మా నాయనమ్మ వూరుకోదు. "మీ నాన్నకి బేబక్కే, మీ అమ్మకీ బేబీ అక్కే, నీక్కూడానా?"అని తిట్టి అత్తమ్మ అని పిలిపించింది .

బెజవాడలో బేబత్తమ్మా, మావయ్య సొంతిల్లు వున్నా అద్దెకి ఓ ఇరవై పోర్షన్ల మేడలో ఓ పోర్షన్లో వుండేవారు .

ఆ పోర్షన్లలో వుండే వాళ్ల లీడర్ ఎవరంటే బేబత్తమ్మే . ఇంటి యజమాని ఈవిడే అని పొరపాటు పడే వాళ్లు చాలామంది .

ఏమన్నా తేడా వస్తే బేబత్తమ్మ ఒక్క అరుపు అరిస్తే ఆడైనా మగైనా బిక్కచచ్చి పోవాల్సిందే . నీళ్ల పంపుల దగ్గర ఎవరికి ఎన్ని బిందెలో ఎవరు ఏ వరసలో తీసుకోవాలో అత్తమ్మ చెప్పాల్సిందే. అందరూ బేబీ గారూ! బేబీ గారూ అంటూ ఏదో ఒక సలహాలకి వస్తానే వుండేవారు .

మా బేబత్తమ్మ ఇంటికి వెళ్లినప్పుడు పక్కింట్లో వుండే అమ్మాయి మీద పీకల్దాకా కోపం. నాకు పూలు మాల కట్టడం. ముగ్గులేయడం, చితగింజలాడడం ఎంత నేర్చుకున్నా వస్తే ఒట్టు .

కానీ అత్తమ్మ ఇంటి పక్కన వుండే ఆ బక్క పిల్ల ఇవన్నీ చేసేస్తే అత్తమ్మ తెగ మెచ్చేసుకునేది. మెచ్చుకున్నా పర్వాలేదు కానీ చూడు ఆడపిల్లంటే ఇట్టా పద్ధతిగా వుండాలి చూసి నేర్చుకో అని పూల మాల కట్టడం నేర్పే పని ఆ పిల్లకి అప్పగించింది .

నేను వున్న మూడురోజుల్లోనూ కనీసం ముడివేయడం కూడా రాకపోగా ఆవిడ బోలెడు డబ్బు పోసి కొన్న మల్లెపూలన్నీ పీకలు తెగి కుప్పలుగా పడి వుండడం చూసి అగ్గిమీద గుగ్గిలం అయ్యింది .

ఇది చూసి ఆ పిల్ల పళ్లన్నీ బయటపెట్టి నవ్వుతుంటే మండి పోయింది .

ఒక రోజు ఇరుగు పొరుగు కలిసి ఇడ్లీ పిండి రుబ్బే కార్యక్రమం పెట్టారు .

నేను ఆ పొత్రాన్ని తిప్పలేక రొప్పుతుంటే మళ్లీ ఆ బక్క పిల్ల తయారు. అది ఇంతలావు పొత్రాన్ని బడబడా తిప్పేస్తా నా వంక చూస్తే మా అత్తమ్మ మళ్లీ ఎత్తుకుంది ఆడపిల్ల ఎట్టా వుండాలో .

కుటంబంలో ఏ ఇంట్లో ఏం జరిగినా బేబక్క అక్కడ వుంటంది. వుండడమంటే ఏదో వుంటం కాదు ఆ ఇంటి వాళ్లు ఏది ఎట్టా చేయాలో ఆ రోజు పొద్దున టిఫిన్ల దగ్గర నుంచి రాత్రి భోజనంలో ఏం వండాలో మొత్తం తనే చెప్పేసి అయ్యన్నీ చేయాలంటే ఏమేం ఏర్పాట్లు చెయ్యాలో చేసేసేది. హమ్మయ్య బేబక్క వచ్చేసింది ఇక పర్వాలా  అని ఆ ఇంటాళ్లు అనుకునే వాళ్లు .

బేబత్తమ్మ ఎంత రుచిగా వండేదంటే చెప్పలేం. పప్పు టమాటా, రోటి పచ్చళ్లు, దోసకాయ మాంసం  బలేగా వండేది .

ఒక రోజు చిట్టెమ్మ, నేను వెళ్లి నప్పుడు బేబక్క వండిన వంటలు తిని చిట్టెమ్మ నాతో రహస్యంగా "ఏమేసి వండిందే ! వంటలు ఇంత బాగుండయ్యి " అని ఆశ్చర్య పోయింది .

పిల్లలందరినీ పోగేసి గోరింటాకు రుబ్బి కాళ్లకి చేతులకి పెట్టి మురిసిపోయేది .

బేబత్తమ్మకి బద్ధకం అనే మాటే తెలియదు. వేసంకాలం వస్తే మల్లెపూల జడలేసేది పొద్దుగ్గా వుండే మల్లెమొగ్గల్ని ఏరి, మధ్యలో ఎర్రటి కనకాంబరాలు, ఆకుపచ్చ ఆకులు కలిపి, విస్తరాకు మీద కుట్టేది. ఇరుగుపొరుగు పిల్లలందరూ వచ్చి పూలజడలేయించుకునే వాళ్లు. బేబక్కకి బెజవాడ ఎగ్జిబిషన్లో పెట్టిన పూలజడల పోటీలో ఫస్ట్ వచ్చేది .

దగ్గరివాళ్లు ఎవరైనా బెజవాడ వచ్చి బేబత్తమ్మ ఇంట్లో దిగకపోతే వాళ్లతో పోట్లాటకి దిగేది .

బార్లపూడి బేబత్తమ్మ వస్తే నాయనమ్మకి పండగే. బేబత్తమ్మ రావడమే ముందు కోటేశుకి ఒక కేను ఇచ్చి ఎవరెవరు గొడ్లకి ఉలవలు వండుతారో ఆళ్ల ఇళ్లకి ఎళ్లి ఉలవలు వుడికినాక వంచే ఉలవనీళ్లు తెమ్మనిపురమాయించేది.” బేబీ నువ్వు పెట్టినంత కమ్మగా ఉలవచారు ఎవరూ పెట్టలేరమ్మాయ్ !" అని పొయ్యిదగ్గర కూర్చోబెట్టేది .

బేబత్తమ్మ పెద్ద మట్టి చట్టి నిండా ఉలవనీళ్లు అంత కళ్లు ఉప్పు , ఇంత కారం , చింతపండు సుద్ద , అప్పుడే చెట్టు నుంచి కోసిన కరేపాకు ఏసి చిక్కగా అయ్యే వరకు పొయ్యిమీద కాసి ఆ తర్వాత ఇంకో మూకుట్లో నెయ్యి పోసి ఎండు మిరపకాయలు , ఎల్లులి పాయ , మళ్లీ కరేపాకుతో తాలింపు ఏస్తే రోడ్డు మీద ఎళ్లే వూళ్లో వాళ్లు ఏంటే బేబీ ఉలవచారు వాసన రోడ్డు దాకా కొడతాందే అని సర్టిఫికెట్లు ఇచ్చేవారు .

ఎవరింటికి ఎళ్లినా వంటింటి చార్జీ బేబత్తమ్మదే ఆవిడ ఎట్టా వండమంటే అట్టా వండాల్సిందే . "మా బేబి అన్నిట్లోనూ ఫస్టే ... చిన్నప్పుడు బళ్లో ఆటల్లో అదే ముందుండేది " అని మా నాన్న అనేవారు.

"ఒరేయ్ మీ ఇంట్లో పెళ్లికి నాకు పట్టుచీర పెట్టాలోయ్ " అని తమ్ముళ్లని సరదాగా అడిగేది. నిజంగానే బేబత్తమ్మకి చీరలంటే ఎంతిష్టమో ఆవిడ ఇనప బీరువా నిండా చీర్ల దొంతరలుండేయి .

అంతెత్తు మనిషి ముదురు రంగు వెంకటగిరి జరీ చీర కట్టుకుని తిరుగుతాంటే పెళ్లి ఇంటికే నిండువచ్చేది. అందరినీ నవ్విస్తా నవ్వుతా బేబత్తమ్మ వున్నంత సేపూ సందడే .

అమ్మాయ్ బేబీ నీకు బీపీ, సుగరూ కదా కాస్త వుప్పులు, కారాలు తగ్గించి తినమ్మా అంటే అబ్బో నా వల్ల కాదమ్మా ఆ తినేది వర్రగా లేకపోతే నేను సచ్చినా ముట్టుకోను అనేది .

అరవై ఏళ్లకే గుండెపోటు బేబత్తమ్మని ఎత్తుకు పోయింది. కొందరు లేని లోటు ఎన్నేళ్లైనా పూడదు. పచ్చని పెళ్లి పందిళ్లలో బేబత్తమ్మని ఒక్కసారైనా తలవాల్సిందే. కుటుంబంలో నలుగురూ కలసి నవ్వే వేళ బేబత్తమ్మ గుర్తొస్తూనే వుంటంది.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments